గంజాయి పట్టివేత

పట్టుబడిన నిందితుడితో పోలీసులు

బోథ్, డిసెంబర్ 19 : బోథ్ మండలంలోని డేరా గ్రామంలో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం వెల్లడించారు. గ్రామానికి చెందిన మెస్రం నారాయణ తన ఇంటి పెరటిలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడు. వీటితోపాటు 360 గ్రాముల ఎండు గంజాయిని విక్రయించాడు. తనిఖీల్లో గంజాయి అమ్మగా వచ్చిన రూ.10 వేలు నగదుతో పాటు నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.19 వేలు ఉంటుందని సీఐ వివరించారు. పట్టుకున్న వారిలో సీఐతోపాటు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 19: కూలీ పనులకు వెళ్లి ఆటోలో ఇంటికి తిరిగి వస్తుండగా వెనుక నుంచి కారు ఢీకొనడంతో మహిళ మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొత్తగూడ(చెక్‌పోస్ట్) కు చెందిన 7 గురు మహిళలు నాగాపూర్ గ్రామానికి పత్తి ఏరేందుకు వెళ్లారు. సాయంత్రం పని ముగించుకొని తిరిగి వస్తుండగా నాగాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద వెనుక నుంచి కారు ఢీ కొనడంతో బానోత్ రేణుక (50) అక్కడికక్కడే మృతి చెందింది. ఒకరికి కాలు విరగగా 5 గురికి గాయాలయ్యాయి.

ఏఈవోకు వినతి

వినతి పత్రం ఇస్తున్న నాయకులు

భైంసా, డిసెంబర్, 19: పట్టణంలోని మున్నూరుకాపు సంఘం కమిటీ తరుపున ఏఈవోకు గురువారం వినతి పత్రం అందించారు. పంటల సర్వేపై ముందస్తుగా కుల సంఘాలకు సమాచారం అందించాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, పోశెట్టి, రాజన్న, రావుల పోశెట్టి, నారాయణ, తదితరులు ఉన్నారు.

పత్తి కొనుగోలు నిలిపివేత

బోథ్, డిసెంబర్ 19 : బోథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని స్వప్న, రాఘవేంద్ర, సాయిదత్త జిన్నింగ్ ఫ్యాక్టరీల్లో సీసీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ ప్రత్యేక శ్రేణి కార్యదర్శి విఠల్ తెలిపారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు కొనుగోలు ఉండవని తెలిపారు. సోమవారం నుంచి కొనుగోలు యధావిధిగా ఉంటాయని, రైతులు గమనించాలని కోరారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

జైనథ్, డిసెంబర్ 19 : మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించేలా ఐకేపీ సిబ్బంది చూడాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సతీశ్ దేశ్‌పాండే సూచించారు. గురువారం కరంజి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో సీబీఆర్ఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు రుణాలు ప్రతి నెలా చెల్లించాలన్నారు. తీసుకున్న రుణాలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతి మహిళ జీవిత బీమా చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీఎం భగవాండ్లు, సీసీ గంగారాం, వీవోఏలు రఫిక్, రామన్న, గణేశ్, ప్రకాశ్ పాల్గొన్నారు.

రిమ్స్ నుంచి ఆటో చోరీ

ఎదులాపురం, డిసెంబర్ 19 : ఆదిలాబాద్ రిమ్స్ దవాఖాన నుంచి ఆటో దొంగతనమైనట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. గురువారం తాటిగూడకు చెందిన షేక్ ఇర్ఫాన్ తన కొడుకు ఆరోగ్యం బాలేదని చికిత్స నిమిత్తం రిమ్స్ దవాఖానకు తీసుకు వచ్చాడు. ఆటో పార్కింగ్ చేసి దవాఖానలోకి వెళ్లి వైద్యం చేయించి తిరిగి వచ్చి చూసే సరికి పార్కింగ్ చేసిన ఆటో కనిపించలేదు. దీంతో టూ టౌన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ విష్ణు ప్రకాశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే

ఉట్నూర్, డిసెంబర్19 : మండల కేంద్రంలోని బోయవాడ, శాంతినగర్ కాలనీల్లో గురువారం ఈవో శంకర్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి స్థితిగతులు, దరఖాస్తూ దారులకు ఇళ్లు ఉందా, లేదా పరిశీలించి ఆన్‌లైన్ నమోదు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఖ య్యూం, లాజర్, గంగాధర్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని వినతి

తాంసి, డిసెంబర్ 19 : పొన్నారి గ్రామ రైతుల దారి సమస్య పరిష్కరించాలని నాందేడ్ రైల్వే స్టేషన్ డీఆర్ఎంకు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. బీఆర్ఎస్ యువ నాయకులు కీర్తి అరుణ్ కుమార్ మాట్లాడుతూ గేట్ నంబర్ 27 వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన బారికేడ్లతో రైతులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని, వెంటనే తొలగించాలన్నారు. రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించి గేటు మూసివేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అశోక్, నాయకులు వెంకటరమణ, చంద్రయ్య, నవీన్ రెడ్డి, రాజు రెడ్డి, వినాయక్ రెడ్డి, గంగయ్య, రాంరెడ్డి పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

ఎదులాపురం,డిసెంబర్19:తెలంగాణ వసతి గృహాల అధికారుల సంఘం సమావేశాన్ని గురువారం ఆదిలాబాద్ టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎనుకున్నారు. ఎన్నికల అధికారిగా టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు సంద అశోక్ నిర్వహించారు. సంఘం జిల్లా నూతన అధ్యక్షుడిగా నరసింహులు, సెక్రటరీ శ్రీనివాస్, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎస్‌కే పర్వేజ్, వైస్ ప్రెసిడెంట్లుగా బీ రవీందర్, గంగాదేవి, రాధా, జాయింట్ సెక్రెటరీగా దేవన్న, రోహిత్, సంధ్య, కోశాధికారిగా చిన్నయ్య, ఆర్గనైజేషన్ సెక్రెటరీగా శ్యాంసుందర్, పబ్లిక్ సెక్రెటరీగా రాథోడ్ అనిల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ రవీందర్, నగేశ్ శ్రీవాణిని ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులకు నియామక పత్రాలను అందజేసి శాలువాలతో సత్కరించారు. వసతి గృహాల అధికారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ నవీన్ కుమార్, ఓం ప్రసాద్ , శివ కుమార్ , సుజాత , దత్తు , ఆదిలాబాద్ జిల్లా వసతి గృహ అధికారుల ఉద్యోగులు పాల్గొన్నారు

జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం



అధ్యక్ష, కార్యదర్శులు పార్థసారథి, సాయికుమార్

ఎదులాపురం,డిసెంబర్19:జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గం గురువారం ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా అధ్యక్షుడిగా కోరెడ్డి పార్థసారథి, ప్రధాన కార్యదర్శిగా జంజర్ల సాయికుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ పేట సంఘ బలోపేతానికి సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని జిల్లా సంఘ భవనానికి కృషి చేస్తామన్నారు. ఎన్నికల అధికారిగా కాంతారావు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల్లో దయానంద్ రెడ్డి, హరిచరణ్ ,రాష్ట్రపల్, మహేశ్, శ్రీనివాస్, వెంకట రమణ, రాము, నందేవు గోపాల్ ఉన్నారు. అలాగే ఎన్నికైన అధ్యక్షకార్యదర్శులకు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఉష్కం రఘుపతి సన్మానించారు.

బోథ్ బస్టాండ్ పరిరక్షణకు కృషి

బస్టాండ్ పరిసరాలను పరిశీలిస్తున్న బొడ్డు గంగారెడ్డి

బోథ్, డిసెంబర్ 19 : బోథ్ బస్టాండ్ పరిసరాలను, ప్రభుత్వ ఆస్తుల రక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని వాటిని రక్షించేందుకు చర్యలు చేపడుతున్నామని బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. గురువారం బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. బస్టాండ్‌కు ప్రహరీ లేకపోవడం, ప్రయాణికులకు పార్కింగ్ సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి, రవాణా శాఖ మంత్రుల దృష్టికి తీసుకు వెళ్లి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. బస్టాండ్ డిజిటల్ మ్యాప్ ఆధారంగా ప్రహరీ కోసం కొలతలు సేకరించారు. బస్టాండ్‌లో రాత్రి సమయంలో ఇబ్బందిగా ఉందని లైటింగ్, తాగునీరు, పశువులు రాకుండా ఉండేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు. ఆర్టీసీ సిబ్బంది, వీడీసీ చైర్మన్ గట్ల గంగాధర్ పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ, డిసెంబర్ 19 : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరం గణితశాస్త్రం బోధించేందుకు ఒక అతిథి అధ్యాపక ఖాళీ పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏ శ్రీనివాస్ తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్‌లో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) ఉండాలని తెలిపారు. స్లేట్, నెట్, పీహెచ్‌డీ, బోధన అనుభవం కలిగిన అధ్యాపకులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 21వ తేదీలోగా అందజేయాలని, అభ్యర్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్‌లో ఈ నెల 23న ఉదయం 11 గంటలకు డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు.

దరఖాస్తు చేసుకోండి

ఎదులాపురం,డిసెంబర్19: తెలంగాణ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మహిళా శక్తి పథకం ద్వారా మైనారిటీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు అందించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కే రాజలింగు తెలిపారు. ఈ నెల 31 తేదీ వరకు మైనార్టీ మహిళలు ముస్లిం, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీ లు ఆన్ లైన్ లో TGOBMMS వెబ్ సైట్ tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిరుపేద నిరాశ్రయులు, వితంతువులు, ఒంటరి మహిళ, అనాథ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. తెల్ల రేషన్ కార్డు, వార్షికాదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్ష యాభై, పట్టణ ప్రాంతాలకు రెండు లక్షలు మించి ఆదాయం ఉండవద్దన్నారు. ఆధార్ కార్డు, మహిళల వయసు 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల మధ్య ఆధార్ కార్డు లో వయసు సరిగ్గా నమోదై ఉండాలన్నారు. కనీసం ఐదో తరగతి విద్యారత ఉండాలన్నారు. ఐదేళ్లలో తెలంగాణ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఇలాంటి ఆర్థిక లబ్ధి పొందలేని వారే అర్హులన్నారు. ఆన్లైన్ దరఖాస్తు చేసిన అనంతరం ధ్రువీకరణ పత్రాలను జిల్లా మైనార్టీ కార్యాలయానికి సంప్రదించాలన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలి

ఎదులాపురం,డిసెంబర్ 19:గ్రామీణ క్రీడాకారులతో పాటు క్రీడాలను మరింత ప్రోత్సహించేందుకు సీఎం కప్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడ పోటీలు కొనసాగుతున్నాయి. గురువారం హాకీ, కరాటే, జుడో, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు. తొలిసారిగా సైక్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి శుక్రవారం ఉదయం సైక్లింగ్ పోటీలు ప్రారంభమవుతాయని, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్వో వెంకటేశ్వర్లు, గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి, కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాష్ట్రపాల్, కోచ్లు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

అర్లి(టీ)లో చలి@5.8 డిగ్రీలు

- ఈ నెలలో రాష్ట్రంలోనే ఆరు సార్లు కనిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు

అర్లి(టీ)లో చలిమంట వద్ద ఉపశమనం పొందుతున్న స్థానికులు

భీంపూర్, డిసెంబర్19 : ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం అర్లి(టీ)లో గురువారం 5.8 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో ఇదే అత్యల్పం ఈ చలికాలం అర్లి(టీ)లో రాష్ట్రస్థాయిలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకావడం ఇది ఆరోసారి కాగా అర్లి(టీ)తో సహ పెన్‌గంగా పరివాహక గుబిడి, టేకిడిరాంపూర్, కొజ్జన్‌గూడ, కరంజి(టీ), గోముత్రి, అంతర్గాం, వడూర్, తాంసి(కే), గొల్లగడ్ ప్రాంతాల్లో చలి తీవ్రతతో స్థానికులు చలిమంటల వద్ద ఉపశమనం పొందుతున్నారు. పిల్లలు, వృద్ధుల కోసం జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

అర్లి(టి)లో దుప్పట్లు పంపిణీ చేసిన కలెక్టర్

రాష్ట్రంలోనే అత్యల్ప కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్న అర్లి(టీ), కొలాం ఆవాసం ఇందూర్‌పల్లిలో కలెక్టర్ రాజర్షిషా పిల్లలు, వృద్ధులకు స్వెటర్లు, బ్లాంకెట్లు అందజేశారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ వారు వీటిని వితరణ చేశారు. అర్లి(టీ) ప్రాంతంలో తీవ్రమైన చలి నేపథ్యంలో అక్కడ ఉన్ని దుస్తుల పంపిణీ, వైద్య శిబిరం ఆవశ్యకమని 'నమస్తే తెలంగాణ' కథనాలు ఇచ్చింది. గురువారం అక్కడ డెంటల్, సాధారణ వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇచ్చారు. చలి నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు కలెక్టర్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, తహసీల్దార్ నలందప్రియ, ఎంపీడీవో గోపాలకృష్ణారెడ్డి, ఇండియన్ డెం టల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎండీ సమియొద్దీన్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామకృష్ణారెడ్డి, భీంపూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్‌రాజ్, డాక్టర్లు, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, నాయకులు తదితరులున్నారు.

అర్లి(టీ)లో స్వెటర్లు, బ్లాంకెట్లు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్‌కు మెట్లు

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

భీంపూర్, డిసెంబర్ 19 : ఎంత ఆధునికత వచ్చినా పుస్తక పఠనం ఆవశ్యకమని, గ్రంథాలయాలు విద్యార్థి, యువత భవితవ్యం తీర్చిదిద్దే సోపానాలు అని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. భీంపూర్ మండలం అర్లి(టీ)లో కలెక్టర్ గురువారం గ్రంథాలయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ప్రారంభించారు. అంతకు ముందు అంగన్‌వాడీ పిల్లలకు ఏకసారూప్య దుస్తుల పంపిణీ చేశారు. ప్రజలు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అర్లి, ఇందూర్‌పల్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఇందూర్‌పల్లి కొలాం ఆదివాసీలు కలెక్టర్‌ను సంప్రదాయ రీతిలో స్వాగతించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు లస్మన్న, టేకాం దాదారావు, వీడీసీ ప్రతినిధులు నవీన్, నితిన్, అశోక్, అంబారావు, రహుఫ్, ఉల్లాస్, ఉపాధ్యాయులు శ్రీకాంత్, రవి, కార్యదర్శి రవికాంత్, గ్రామస్తులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర కో ఆర్డినేటర్ విద్యాసాగర్

ఎదులాపురం,డిసెంబర్19:పర్యావరణ హితమైన వాటిని వాడుతూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ రాష్ట్ర కోఆర్డినేటర్ విద్యాసాగర్ అన్నారు. ఎన్జీసీ ఆధ్వర్యంలో ఆయా పాఠశాల విద్యార్థులకు గురువారం డైట్ కళాశాలలో ఇకో ఫ్రెండ్లీ సోప్, లీక్విడ్, డిష్ బార్లను ఎలా తయారు చేయాలో అవగాహన కల్పించారు. టెక్నికల్ సిబ్బంది కార్తీక్ సబ్బుల తయారీని వివరించాచు. ప్రస్తుతం మార్కెట్‌లో లభించే రసాయనిక సబ్బుల కారణంగా ఎన్నో చర్మ వ్యాధులు వస్తున్నాయన్నారు. ఎకో ఫ్రెండ్లీ విధానంతో తయారు చేసిన సబ్బులను వినియోగించాలని సూచించారు. ప్రతి స్కూల్ నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులను ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నామన్నారు. సబ్బులతో పాటు హ్యాండ్ వాష్ లీక్విడ్ తయారు నేర్చుకుంటే ఇది చిన్న పరిశ్రమల ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా కూడా లాభం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్, రూరల్ ఎంఈవోలు సోమయ్య, కంటే నర్సయ్య, డైట్ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్, బరంపూర్ పీజీహెచ్ఎం ప్రత్యూషా. ఎనీ సీ గైడ్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 19: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అడిషల్ డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్ అన్నారు. గురువారం మండలంలోని లాల్‌టెక్డి పాఠశాలను, సరుకుల గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారం గల భోజనం అందించాలన్నారు. పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 19: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈవో ఆశన్న అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులకు గణితం బోధించారు. విద్యార్థులకు విద్యతో పాటు పోషకాలతో భోజనాన్ని అందించాలని అన్నారు. అనంతరం లక్కారంలోని ఉడ్డా పాఠశాలను తనిఖీ చేసి రిజిష్టరు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

మేలు జాతి విత్తనాలను వినియోగించాలి

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 19: మేలు జాతి విత్తనాలను వినియోగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ రజిని, ప్రవీణ్ కుమార్‌లు అన్నారు. గురువారం మండలంలోని నర్సాపూర్(బీ) గ్రామంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం జగిత్యాల జిల్లా పొలాస, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం వారి ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ హైదరాబాద్ వారి సహకారంతో జిల్లాలోని 8 గ్రామాల రైతులకు జొన్న సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ జొన్న ఎక్కువ దిగుబడి వచ్చే విత్తనాలను ఎంచుకోవాలని సూచించారు. మార్కెటింగ్‌పై వివరించారు. అనంతరం హైబ్రిడ్ జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సేవా నాయక్, శ్రీనివాస్, విఠల్, ప్రజామిత్ర రైతు సమాఖ్య రైతులు గంగాధర్, నాగోరాంప, ఏఈవోలు జయశ్రీ, రాజశేఖర్, రంజిత్, గ్రామ పటేల్ జ్యోతిరాం, సీసీడీ సిబ్బంది శివరాజ్, ప్రశాంత్, జగన్ పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల అరెస్ట్



మాల మహానాడు నాయకులను అరెస్ట్ చేసిన ఖానాపూర్ పోలీసులు

నమస్తే నెట్‌వర్క్, డిసెంబర్ 19: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని పలు మండలాల నుంచి వెళ్తున్న మాల మహానాడు నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దళిత వర్గీకరణ పేరుతో మాలలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని నినాదాలు చేశారు.

సోయా కొనుగోళ్లపై విచారణ చేపట్టాలి

వెనుక్కు వచ్చిన సోయాలను చూపుతున్న డైరెక్టర్ రాజు యాదవ్

బోథ్, డిసెంబర్ 19 : బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సోయా కొనుగోళ్లపై విచారణ చేపట్టాలని సొసైటీ డైరెక్టర్ రాజు యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం బోథ్ మార్కెట్ యార్డుకు గోదాం నుంచి తిరిగి వచ్చిన సోయాలను పరిశీలించారు. ఈ నెల 4, 5 తేదీల్లో చేపట్టిన సోయా కొనుగోళ్లలో భారీ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. కొనుగోలు చేసి లారీల్లో గోదాంకు తరలించిన బస్తాల్లో 222 బస్తాలు మట్టితో కూడిన తేమ శాతం ఎక్కువగా ఉన్న సోయా బస్తాలు రిజెక్ట్ అయ్యాయన్నారు. రెండు రోజుల్లో సుమారు 7 వేల క్వింటాళ్ల వరకు అక్రమంగా కొనుగోలు చేశారని ఆరోపించారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో వీసీ ముఖాముఖి

మాట్లాడుతున్న ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్

బాసర, డిసెంబర్ 19 : బాసర ట్రిపుల్‌ఐటీలో గురువారం ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్ విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయ విధానాలు, కార్యక్రమాలను రూపొందించడంలో విద్యార్థి కేంద్రీకృత విధానం యొక్క ప్రాముఖ్యతను వీసీ వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలందించాలి

భైంసా, డిసెంబర్, 19: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని డిస్కం ఎస్ఈ సుదర్శనం అన్నారు. ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో డివిజన్ పరిధిలోని ఎనిమిది సెక్షన్ల అధికారులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో ఆటంకాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు చేసే సమయంలో లైన్‌పై సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలన్నారు. యాసంగి సీజన్ ప్రారంభమైనందున వ్యవసాయానికి సరఫరా చేసే విద్యుత్‌ను సైతం ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో భైంసా డిస్కం డీఈ శ్రీనివాస్ రెడ్డి, ఇన్‌చార్జి ఏడీఈ ఆదిత్యతో పాటు ఎనిమిది సెక్షన్ల ఏఈలు, ఎస్ఏవో సుదర్శన్‌తో పాటు పలువురు ఉన్నారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి



దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

ఉట్నూర్, డిసెంబర్ 19: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ టీచర్స్(సీఆర్టీల) సమస్యలు పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు రాష్ట్ర అదనపు కార్యదర్శి దిలేష్ చౌహాన్, రాష్ట్ర కార్యదర్శి శీతల్, జిల్లా కార్యదర్శులు అశోక్, శ్రీనివాస్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న రిలే 4వ రోజు దీక్షకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలో సీఆర్టీలు కొన్ని సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యను అందిస్తున్నారన్నారు. కాని వారికి ఉద్యోగ భద్రత, ప్రతి నెల జీతాలు ఇవ్వకపోవడం, కనీస సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమన్నారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ పీవోకు వినతిపత్రం సమర్పించారు. ఇందుకు స్పందించిన పీవో మాట్లాడుతూ తమ డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

టేకు చెట్ల నరికివేత

స్మగ్లర్లు నరికివేసిన చెట్టు

నరికివేసిన స్థలంలో మిగిలిన దుంగలను ట్రాక్టర్‌లో కలప డిపోకు తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

ఖానాపూర్ టౌన్, డిసెంబర్ 16 : ఖానాపూర్- నిర్మల్ ప్రధాన రహదారికి పక్కనే కుమ్రం భీం చౌరస్తాలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు మూడు భారీ టేకు వృక్షాలను నరికి వేశారు. ఖానాపూర్ టేకుకు అధిక డిమాండ్ ఉండడంతో కొందరు సామిల్ యజమానులు అధికారుల అండదండలతో స్మగ్లర్లతో చేతులు కలిపి ఈ దందాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ లేకనే అటవీ సిబ్బంది ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు స్థానికుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ఎఫ్ఆర్వో కిరణ్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

నేడు కోతిదేవుని జాతర

లక్ష్మణచాంద, డిసెంబర్ 19 : మండలంలోని ధర్మారం గ్రామంలో ఈ నెల 19, 20 తేదీల్లో కోతి దేవుని జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్ తదితర ప్రాంతాల నుంచి తరలిరానున్న భక్తుల కోసం తగిన వసతులు కల్పించినట్లు తెలిపారు.

ఉద్యోగోన్నతి పొందిన డీఈకి సన్మానం

సోన్, డిసెంబర్ 19 : పంచాయతీరాజ్‌శాఖలో నిర్మల్ మండల ఏఈగా 11 ఏళ్ల పాటు విధులు నిర్వహించి క్వాలిటీ కంట్రోల్ డీఈగా ఉద్యోగోన్నతి పొందిన గురునాథ్‌ను గురువారం మాజీ సర్పంచులు సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్పీ సీఈవో గోవింద్, మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి, మాజీ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు నవాత్ గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, పోశెట్టి, సాయన్న, తదితరులున్నారు.

టీజీబీ భవనం ప్రారంభం

భవనాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ శోభ

దిలావర్‌పూర్ డిసెంబర్ 19 : దిలావర్‌పూర్ గ్రామంలో గ్రామీణ బ్యాంకు నూతన భవనాన్ని బ్యాంక్ చైర్మన్ శోభ ప్రారంభించారు. బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం రామారావు, బ్యాంక్ మేనేజర్ ఆశోక్, ఫీల్డ్ అధికారి అజయ్, క్యాషియర్ నరసింహారావు, నాయకులు రాజరెడ్డి, పాల్దే శ్రీనివాస్, అర్గుల రమణ, ఐకేపీ కార్యాలయ సీసీలు. సీఏలు ఉన్నారు.

నేడు నీటి విడుదలపై రైతులతో సమావేశం

సారంగాపూర్, డిసెంబర్ 19 : ఈ నెల 20న రైతువేదిక భవనంలో రైతులతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో స్వర్ణ ప్రాజెక్టు ఆర్ఎఫ్, ఎల్ఫ్, జౌళినాల కెనాల్ ద్వారా రబీ పంటలకు ఆయకట్టు రైతులకు నీటి విడుదలపై సమావేశం ఉంటుందన్నారు. ప్రాజెక్టు ఆయకట్టు రైతులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

సూచిక బోర్డుల ఏర్పాటు

సోన్, డిసెంబర్ 19 : నిర్మల్ మండలంలోని చిట్యాల్ బ్రిడ్జి వద్ద గురువారం సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. బ్రిడ్జిపై ఇరువైపులా వచ్చే వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు జరగకుండా నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ చర్యలు తీసుకున్నారు. సూచిక బోర్డు, సోలార్ లైట్లు, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేశారు. ఎస్ఐ లింబాద్రి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

స్వాములకు ప్రథమ చికిత్స కిట్లు అందజేత

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన భైంసా ఫుట్‌బాల్ జట్టు

భైంసా, డిసెంబర్, 19: భైంసా పట్టణంలోని ఏఎస్పీ కార్యాలయంలో భైంసా కాలనీ అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో వాహనాల్లో శబరిమల యాత్రకు వెళ్లే స్వాముల కోసం ఉచితంగా అందించే ప్రథమ చికిత్స కిట్లను భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ ఆవిష్కరించారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప స్వాములకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు, కాలనీ అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు ఆశమోల్ల మోహన్, గురుస్వాములు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

భైంసాటౌన్,డిసెంబర్19: సీఎం కప్ క్రీడల్లో భాగంగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో గురువారం నిర్వహించిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఖానాపూర్ జట్టుపై భైంసా జట్టు 7-0 పాయింట్లతో గెలుపొంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది.

నేడు 'డయల్ యువర్ డీఎం'

భైంసా, డిసెంబర్, 19: నేడు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డీఎం హరిప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు సెల్ నంబర్ 9959226005కు డయల్ చేసి భైంసాతో పాటు పరిసర ప్రాంత ప్రయాణికులు సమస్యలను తెలుపాలని సూచించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు

లోకేశ్వరం, డిసెంబర్, 19: మండలంలోని లక్ష్మీ నగర్ తండాకు చెందిన మూడ్ రాందాస్ తాగుడికి బానిసయ్యాడు. తాగి ఇంట్లో గొడవ పెడుతున్నావని భార్య సుశీల మందలించగా మనస్తాపంతో రాందాస్ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకొని ఆత్మహత్య యత్నించాడు. వెంటనే ఆమె డయల్ 100కు కాల్ చేయగా లోకేశ్వరం పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన బ్లూ కోల్ట్స్ సిబ్బంది రాజేశ్వర్, రాజ్ కుమార్ వెంటనే స్పందించి ఘటనా స్థలానికి వెళ్లి ఇంటి తలుపులు బద్దలు కొట్టి అతనిని కాపాడారు. అతడికి కౌన్సెలింగ్ ఇచ్చి భార్యకు అప్పగించారు. ఈ సందర్భంగా కానిస్టేబుళ్లను ఎస్ఐ అభినందించారు.

బస్తీ దవాఖానను సద్వినియోగం చేసుకోవాలి



రోగుల వివరాలను తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, డిసెంబర్ 19: మున్సిపాలిటీలోని ఒకటో వార్డు గాంధీనగర్ బస్తీ దవాఖానను గురువారం మున్సిపల్ చైర్మన్ రాజురా సత్యం, వైస్ చైర్మన్ కావలి సంతోష్ తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ అనారోగ్యాలతో బస్తీ దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఐసీడీఎస్ సీడీపీవో సరిత, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఫొటో, వీడియోగ్రఫీ కార్యవర్గం ఎన్నిక

నర్సాపూర్ (జీ), డిసెంబర్ 19: దిలావర్‌పూర్, నర్సాపూర్ (జీ) ఫొటో గ్రఫీ, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఎన్నికలు నిర్మల్ జిల్లా సంఘం అధ్యక్షుడు అయిట్ల ప్రవీణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి చిట్టామని శ్రీనివాస్ కృష్ణస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సగ్గం వంశీ, కెమెరా క్లబ్ అధ్యక్షుడు సుమన్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా కార్యవర్గ సభ్యులు వినీత్ సమక్షంలో ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షుడు బొమ్మెన లక్ష్మీపతి, అధ్యక్షుడు దూసముడి సవిన్, ఉపాధ్యక్షుడు కిని వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కడ్తాల సాయంధర్, కోశాధికారి గంగుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి మెడాజీ నరేశ్, ప్రచార కార్యదర్శి నరేశ్, ముఖ్య సలహాదారులు బుద్దుల అశోక్, కొత్తకొండ శివ ప్రసాద్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిని జిల్లా కార్యవర్గ సభ్యులు సన్మానించారు.